క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారాలు



సత్కారాలు అందుకున్న వారితో ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: మండలంలో పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం రాత్రి స్థానిక మూడు తూముల సెంటర్‌లో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు వారిని సన్మానించారు. కవి, రచయిత కత్తిమండ ప్రతాప్, యువ నాయకుడు కుసుమ చింటు సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విద్యార్థులు చొప్పల సోను, కుసుమ క్రెసెంట్, కుసుమ జోయ్, గెడ్డం హన్సిని ఏంజెల్, కుసుమ షిప్రావలి సత్కారాలు అందుకున్నారు.

విద్యా కానుకను సక్రమంగా అందించాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా కానుకను విద్యార్థులకు సక్రమంగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బి.వీరవెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం ఎంఈఓ ఎస్‌వీ సుబ్బరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాకానుక అమలు తీరును, రికార్డుల నిర్వహణను స్థానిక సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఆర్పీలకు వివరించారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: పి.గన్నవరం సీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 42 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించారు. వీరిలో ముగ్గురిని క్రిటికల్ కేసులుగా గుర్తించి అమలాపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. వై.కొత్తపల్లి వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, వైద్యులు ఎల్.శిరీష, రాఘవేంద్రరావు, గీతా గాయత్రి, చందన తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రానికి ఇటుక బట్టీ కార్మికుల తరలింపు



చుకోడియా కుటుంబ సభ్యులతో ఎస్సై శ్రీను నాయక్

ఆలమూరు/అమలాపురం టౌన్: చొప్పెల్లలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒడిశా కార్మికులను సంబంధిత బట్టీ యజమాని వేధింపులకు గురి చేస్తున్నాడంటూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంపై జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ స్పందించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్కే ఖాదర్‌బాషా నేతృత్వంలో కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్‌కు విచారణ బాధ్యతను గురువారం అప్పగించారు. దీంతో ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ తన సిబ్బందితో స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న ఇటుక బట్టీ వద్దకు వెళ్లారు. కార్మికుడు జగన్నాథ చుకోడియాను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బట్టీ యజమాని వానపల్లి మణికంఠ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటుక బట్టీలో తనతో పాటు, భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు పని చేస్తున్నారని వివరించారు. తన కుటుంబ సభ్యులను వెంటనే సొంత రాష్ట్రానికి పంపించి, తమను ఆదుకోవాలని, యజమాని చెర నుంచి కాపాడాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎస్సై శ్రీనునాయక్ అక్కడి పరిస్థితిని అవగాహన చేసుకున్నారు. బట్టీ యజమాని మణికంఠను పిలిపించి, కార్మికుడు చుకోడియా కుటుంబానికి రవాణా ఖర్చులు ఇప్పించారు. పోలీసు సిబ్బంది సహకారంతో కార్మికులను రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి, రైలు ఎక్కించి ఒడిశాకు పంపించారు. ఎస్సై శ్రీను నాయక్ బృందాన్ని ఎస్పీ శ్రీధర్ అభినందించారు. ఇలాఉండగా కార్మికులు పని చేసేందుకు అడ్వాన్స్‌గా రూ.70 వేలు అందించానని, వారు పనిచేయకుంటే ఎలా అంటూ బట్టీ యజమాని మణికంఠ పోలీసుల వద్ద వాపోయినట్టు తెలిసింది.

ఘనంగా అమ్మవారి తీర్థం

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

సమరోత్సాహం

- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఎన్నికల జోష్
- ప్రచారంలో దూసుకుపోతున్న ఫ్యాన్
- కూటమిలో కుమ్ములాటలు.. అయోమయంలో కేడర్



పార్టీ శ్రేణుల కోలాహలం నడుమ పి.గన్నవరం అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఎన్నికల ప్రచారం

మామిడికుదురు: సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. పోలింగ్‌కు ఇక నాలుగు రోజులే ఉండడంతో ప్రచారం తారాస్థాయికి చేరింది. పి.గన్నవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ అభ్యర్థిగా జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును ముందుగానే ప్రకటించడంతో ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఆయన కుటుంబ సభ్యులతో పాటు, పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని మామిడికుదురు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కులాల వారీగా ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఇరిగేషన్ శాఖ ఉద్యోగిగా గతంలో రాజోలు సబ్ డివిజన్‌లో పని చేయడం, పదవీ విరమణ అనంతరం పి.గన్నవరం కో–ఆర్డినేటర్‌గా పని చేయడం, పి.గన్నవరం నుంచి జెడ్పీటీసీగా విజయం సాధించి, జెడ్పీ చైర్మన్ హోదాలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం విప్పర్తికి కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. వీటికి తోడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు.. ఎన్నికల్లో పార్టీ విజయానికి ఎంతో దోహదపడతాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

భారీగా చేరికలతో ఫుల్ జోష్

గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నేలపూడి స్టాలిన్‌బాబు, జనసేనకు చెందిన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆయా పార్టీలకు రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీకి చెందిన నేతలు మందపాటి కిరణ్‌కుమార్, అనితా శుభజ్యోతి దంపతులతో పాటు, మామిడికుదురు మండల సర్పంచ్‌ల సమాఖ్య మాజీ అధ్యక్షుడు నీతిపూడి గణేష్‌బాబు వంటి ప్రముఖులు వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీలో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఆయా అంశాలు వైఎస్సార్ సీపీకి ఎంతో బలాన్నిచ్చాయి.

కూటమికి శిరోభారం

పి.గన్నవరం నియోజకవర్గ అభ్యర్థిగా టీడీపీ మహాసేన రాజేష్ పేరును ముందుగా ప్రకటించింది. అతని అభ్యర్థిత్వంపై జనసేనతో పాటు, టీడీపీ శ్రేణులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. తీవ్ర కాలయాపన తర్వాత ఈ సీటును మళ్లీ జనసేనకు కేటాయించడం కూటమికి శిరోభారంగా మారిందని చెబుతున్నారు. ఈ వ్యవహారమంతా ఓ కొలిక్కి వచ్చేసరికి తీవ్ర జాప్యం కావడం కూడా కూటమికి మైనస్‌గా మారింది.

కఠిన పరీక్ష

టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సమన్వయం లేకపోవడం కూటమి కీలక నేతలకు మింగుడు పడడం లేదు. వీటిని చక్కదిద్దడం వారికి తలనొప్పిగా మారింది. జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు నియోజకవర్గ ప్రజలతో అంతగా సత్సంబంధాలు లేకపోవడం కూడా ఆ పార్టీకి విజయావకాశాలు దెబ్బతీసేవిగా విశ్లేషకులు చెబుతున్నారు. వీటన్నింటినీ అధిగమించి ఎన్నికల్లో ముందుకు వెళ్లడం కూటమి నేతలకు కఠిన పరీక్షగా మారిందనేది ప్రస్ఫుటమవుతోంది. గడువు సమీపిస్తున్నా.. ఆయా పరిణామాలు కూటమి నేతలకు మింగుడు పడకపోవడం, ఆయా పార్టీల కేడర్‌ను అయోమయంలో పడేస్తోంది.

కలిసొచ్చిన సీఎం పర్యటన

మొత్తానికి నియోజకవర్గంలోని ప్రత్యర్థి శిబిరంలో చోటుచేసుకున్న పరిణామాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా మారాయని రాజకీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంబాజీపేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం కావడం, ఎన్నికల బహిరంగ సభకు భారీగా ప్రజలు తరలిరావడం పార్టీని దాదాపు విజయ తీరానికి చేర్చినట్టు వివిధ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం తగదు

ఏజీపీ యర్రంశెట్టి అప్పలనాయుడు



రాజోలు: కొన్ని రాజకీయ పార్టీల వారు వారి స్వప్రయోజనాల కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేయడం సరి కాదని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యర్రంశెట్టి అయ్యప్పనాయుడు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ సంపూర్ణ భూ హక్కు చట్టంపై లేనిపోని అపోహలు సృష్టించి, ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. భూమికి సంపూర్ణ హక్కులతో పాటు, రక్షణ కల్పించి భూ కుంభకోణాలు, అక్రమాలను నిరోధించడమే ఈ చట్టం ముఖ్యోద్దేశమన్నారు. 2019లోనే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ముసాయిదా పంపిందన్నారు. నీతి ఆయోగ్, ప్లానింగ్ కమిషన్ సిఫార్సుల మేరకే చట్టం చేయబడుతుందని, దేశవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేయాల్సి ఉందన్నారు. సర్వే పూర్తయిన తర్వాతే న్యాయ నిపుణులు, మేధావులు, రెవెన్యూ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని, అన్ని రాష్ట్రాల్లో చట్టాన్ని అమలు చేస్తారన్నారు.

వైఎస్సార్ సీపీకి అనుకూల పవనాలు

పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు



విలస గ్రామంలో చంటి బిడ్డను ఎత్తుకుని బుజ్జగిస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలని పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వైఎస్సార్ సీపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, ఎవరి నోట విన్నా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుస్తున్నట్టు చెబుతున్నారని పేర్కొన్నారు. గురువారం పోతుకుర్రు, మడుపల్లి, చింతనలంక, వెలువపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ, గ్రామాల్లో ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విప్పర్తి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇస్తున్న బూటకపు హామీలను ప్రజలు నమ్మబోరన్నారు. మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయనతోనే రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ నాయకుడు నేలపూడి స్టాలిన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సువర్ణ పరిపాలన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, కమిటి వెంకటేశ్వరరావు, పుల్లంశెట్టి, చిలువూరి విజ్జిరాజు, సానబోయిన నాగేశ్వరరావు, పినిపే బుజ్జి, మద్దింశెట్టి రాంబాబు, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్ సస్పెండ్

మలికిపురం: చింతలమోరి గ్రామంలో విద్యుత్ లైన్‌మన్ సీహెచ్.వెంకట్రావును ఉన్నతాధికారులు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్టు ఏపీఈపీడీసీఎల్ రాజోలు ఏడీఈ సీహెచ్ శ్రీనివాసరావు, ఏఈ మద్దూరి సతీష్ బుధవారం ధ్రువీకరించారు. గ్రామంలో కొల్లు డాల్‌రాజు అనే వినియోగదారుడు తన ఇంటి విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని లైన్‌మన్ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. అతని వద్ద రూ.3 వేలు తీసుకున్న వెంకట్రావు.. బిల్లు ఎక్కువ రాకుండా విద్యుత్ మీటరును సీల్ చేశాడు. అయినా మరుసటి నెల బిల్లు అధికంగా రావడంతో డాల్ రాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో పాటు గ్రామంలో రొయ్యల చెరువుకు అక్రమ విద్యుత్ ఇస్తున్నాడని కూడా లైన్‌మన్ వెంకట్రావుపై సర్పంచ్ రాపక రమేష్‌బాబు ఫిర్యాదు ఇచ్చారు. ఆయా ఫిర్యాదులపై విచారణ చేసిన ఉన్నతాధికారులు.. లైన్‌మన్ వెంకట్రావుపై వేటు వేశారు.

హోరెత్తిన జగ్గిరెడ్డి ఎన్నికల ప్రచారం

- కొత్తపేటలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి రోడ్ షో
- అడుగడుగునా ప్రజల బ్రహ్మారథం



కొత్తపేట రోడ్ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఎన్నికల ప్రచార రోడ్ షో తారాస్థాయిలో హోరెత్తింది. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించగా, అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. గురువారం జగ్గిరెడ్డి స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అక్కడి నుంచి ప్రచారం ప్రారంభించారు. వందలాది మోటార్ సైకిళ్లపై వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు వెంట రాగా, ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అడుగడుగునా వివిధ వర్గాల ప్రజలు జగ్గిరెడ్డికి పూలమాలలతో ఘనస్వాగతం పలకగా, పలుచోట్ల గజమాలలతో సత్కరించారు. దారిపొడవునా జై జగన్.. జై జగ్గిరెడ్డి నినాదాలు మార్మోగాయి.

జేసీబీలతో పూలవర్షం, గజమాలతో మహా స్వాగతం

అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు ఇంటి వద్ద ఆయన తనయుడు, యువజన విభాగం మండల అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్ ఆధ్వర్యంలో రెండు జేసీబీలతో పూలవర్షం కురిపించి, మరో క్రేన్‌తో భారీ గజమాలతో మహా స్వాగతం పలికారు. అంతకు ముందు గ్రామ దేవత బంగారమ్మతల్లి ఆలయం సమీపంలో పార్టీ నాయకుడు భీమనాదం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రేన్‌తో గజమాలతో ఘనస్వాగతం పలికారు. స్థానిక బోడిపాలెం, సత్యా సెంటర్ మీదుగా పాత బస్టాండ్ సెంటర్‌కు ప్రచారం చేరుకోగా, అక్కడ అంబేడ్కర్, పూలే విగ్రహాలకు జగ్గిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు.

జగనన్న పాలన మరో స్వర్ణయుగం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా అమలు చేసి రామరాజ్యాన్ని తలపించారని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. పురాణాల్లో పేర్కొన్నట్టుగా రామరాజ్యంలో ప్రజలు ఎంత సుభిక్షంగా జీవించారో, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కూడా అలాగే జీవనం సాగించారన్నారు. రాష్ట్రానికి వైఎస్ రాజశేఖరరెడ్డి పరిపాలన ఓ స్వర్ణయుగమైతే, ఆయన స్ఫూర్తితో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తండ్రిని మించిన తనయునిగా అనేక సంక్షేమ పథకాలతో మరో స్వర్ణయుగాన్ని తెచ్చారన్నారు. భవిష్యత్తులో ఆయా పథకాలన్నీ కొనసాగిస్తూ, మరిన్ని పథకాలను అమలు చేయనున్నారని వివరించారు. నీతి, నిజాయితీకి కట్టుబడి ప్రజాసేవ చేస్తున్నది తానైతే, తనపై పోటీ చేస్తున్న ప్రతిపక్ష నేతది అవినీతి కార్యకలాపాల చరిత్ర అని తీవ్రంగా ఎండగట్టారు. తనను కులమత, వర్గాలకతీతంగా ఆదరిస్తున్న అందరివాడినన్నారు. హామీలు ఇవ్వడమే కానీ, అమలు చేయడం అలవాటు లేని ప్రతిపక్ష కూటమి, ముఖ్యంగా చంద్రబాబు మాటలు నమ్మవద్దని కోరారు. ఎవరి వల్ల లబ్ధి చేకూరిందో ప్రజలే ఆత్మ పరిశీలన చేసుకోవాలని, చేసిన మంచిని గుర్తించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుర్రా శ్రీను, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పోతుల చంద్రావతి, గ్రామ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి భారీ గజమాలతో పలుకుతున్న స్వాగతం

రావులపాలెం: ఎన్నికల్లో గెలుపు మనదే అంటూ వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. గోపాలపురంలో గురువారం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరసింహరాజు గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ రాజు, పెద్దిరాజు సూర్యనారాయణరాజు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటేయండి

రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు



మలికిపురంలో గొల్లపల్లి సూర్యారావును కలిసిన పార్టీ శ్రేణులు

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గుర్తించుకుని, ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయాలని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సఖినేటిపల్లి మండలం గుడిముల గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు మలికిపురంలో గొల్లపల్లి సూర్యారావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓటు వేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఎంపీపీ వీరామల్లిబాబు, కొల్లాబత్తుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: జగన్ కోసం సిద్ధం కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి కమిటీలు, పార్టీ నాయకులు వేర్వేరు గ్రామాల్లో ఇంటింటికీ విస్తృత ప్రచారం చేశారు. సఖినేటిపల్లి సువర్ణపేటలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, నాయకులు ప్రచారం చేశారు. రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో భారీగా చేరికలు



జొన్నాడలో వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న జగ్గిరెడ్డి

ఆలమూరు: కొత్తపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజాదరణ చూస్తుంటే వైఎస్సార్ సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని సిట్టింగ్ ఎమ్మెల్యే, పార్టీ అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని జొన్నాడ, చెముడులంక గ్రామాల్లో గురువారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచారంలో జగ్గిరెడ్డి సమక్షంలో సుమారు 300 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. చెముడులంకలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 100 మంది పార్టీలో చేరారు. జొన్నాడలో పార్టీ సీనియర్ నేత ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి (దొరబాబు), సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహర్ ఆదిత్యరెడ్డి ఆధ్వర్యంలో బీసీ ఏరియాకు చెందిన సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు, అలాగే టీడీపీ నేతల కుయుక్తులతో ఆ పార్టీ కండువా కప్పుకున్న ఎస్ఎంసీ అధ్యక్షుడు నాగిరెడ్డి జనార్దన్ మళ్లీ వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ కండువా వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో కష్టపడిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించి, పేద ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పిస్తామని జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు.

జగన్‌తోనే బీసీలకు రాజ్యాధికారం

ఆత్మీయ సమావేశంలో బీసీ నేతలు



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాపాక వరప్రసాద్

అయినవిల్లి: బీసీలకు రాజ్యాధికారం ఇచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన రుణం బీసీలు ఓట్లు వేసి తీర్చుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు అన్నారు. తొత్తరమూడిలో గురువారం బీసీల ఆత్మీయ సమావేశం అంకం వీర్రాజు అధ్యతన జరిగింది. ముఖ్య అతిథులుగా అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను టీడీపీ అధినేత చంద్రబాబు అణగదొక్కారని మండిపడ్డారు. ఏనాడూ బీసీల ఉన్నతిని పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అత్యంత ప్రాధాన్యం కల్పించారన్నారు. రాజ్యాధికారం దిశగా బీసీలను ఏకతాటిపై నడిపిస్తున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబు బీసీల ఓట్ల కోసం మొసలి కన్నీరు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వాసంశెట్టి తాతాజీ, కుడుపూడి రామకృష్ణ, మట్టపర్తి వెంకటరమణ, మేడిశెట్టి శ్రీను, పోతబత్తుల అంజనేయులు, సత్తిబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే పూర్తి సహకారం

శెట్టిబలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే పూర్తి మద్దతు ఇవ్వాలని శెట్టిబలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. గంగలకుర్రు అగ్రహారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో శెట్టిబలిజ సంఘ సీనియర్ నాయకులు ఎంఎం శెట్టి అధ్యక్షతన మండల శెట్టిబలిజ సంఘ ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, శెట్టిబలిజ సంఘ నాయకులు కుడుపూడి భరత్‌భూషణ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే శెట్టిబలిజలకు సముచిత స్థానం లభించిందన్నారు. బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ క్యాస్ట్ అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నింటా బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇద్దరు శెట్టిబలిజ నేతలకు రాజ్యసభ సీట్లు ఇచ్చి, ఆ చట్టసభకు తొలిసారి సగర్వంగా పంపించారన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్, ఎమ్మెల్సీలతో పాటు, పలు పదవులను ఇచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే శెట్టిబలిజలకు నిజమైన మేలు జరిగిందన్నారు. ఎన్నికలకు కొద్ది రోజులే గడువున్న నేపథ్యంలో అహర్నిశలు కష్టపడి, బాధ్యత, ఉత్సాహంతో సంఘీయులందరూ కృషి చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావును, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు శెట్టిబలిజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాంద్రేగుల శ్రీనివాసరావు, వాసంశెట్టి పెదబాబు, పితాని వీరాస్వామి, బొంతు శ్రీనివాస్, కాంద్రేగుల గోపి, రాయుడు షణ్ముఖ్, కుడుపూడి సత్తిబాబు, రాయుడు కృష్ణమహేష్, బొంతు జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణులతో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీకి చెందిన బ్రాహ్మణ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం స్థానిక భూపయ్య అగ్రహారంలోని మంథా రాంబాబు స్థల ప్రాంగణంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు జరగనుందని ఆహ్వాన కమిటీ ప్రతినిధులు మాచిరాజు రవికుమార్, మంథా శివ వెల్లడించారు. భూపయ్య అగ్రహారంలో గురువారం ఆహ్వాన కమిటీ బ్రాహ్మణ నాయకులు సమావేశమై ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసే అంశంపై చర్చించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బ్రాహ్మణ నాయకులు పాలుగమ్మి వాసు, కాదంబర శాస్త్రి, పుట్రేవు చందు, గోరువంతుల సీతారామ్, విస్సాప్రగడ చిన్న, ఉపద్రష్ట విక్రమ్, దిట్టకవి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.